## ఈవారం కథ

# అన్నపూర్ణ - అతిథి

జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం

'మనిషికో కళ మహిలో సుమతీ' పూర్వపునానుడి! మరి నాకున్న గుణం కళంటారో, ఇదో రకం జబ్బేనని తేల్చి పారేస్తారో, కాక – ఆంగ్ల భాషలో మరేదన్నా పదం వుంటే ఉపయోగిస్తారో మీ ఇష్టం. నాకీ గుణం చిన్నప్పట్నుంచీ వుంది.

పెదవుల కదలికల్ని పరికించి, గ్రహించి ఏవంటున్నారో చెప్పడం. చూపుల్ని నిశితంగా గమనించి మనసులో ఏమనుకుంటున్నారో ఊహించేవాడ్ని. అది నూటికి నూరుపాళ్ళు కరెక్టయిన సందర్భాలు అనేకం. బహుశా చెవిటితనం వలన అలవడి వుంటుందీ విద్య నాకు. అయితే గ్రహించిన విషయాన్ని వ్యక్తం చేసే భాషాభినివేశం లేదు అప్పడు; చిన్నతనం కావడంవలన. ఇప్పడు వ్యక్తం చేసే వయసు కాదు.

* * * * *

మిట్టమధ్యాహ్నం పన్నెండు గంటలు!

గ్రీష్మం ప్రతాపాగ్నితో లోకాన్ని కరకరలాడిస్తున్నది. రహదారి మీద రాళ్ళు నిప్పరవ్వల్లా శెగలు విడుస్తున్నై.

తడి అంగోస్త్రం తలమీద వేసుకుని వంటగది లోంచి వీధి వాకిట్లోకి అక్కడ్నుంచీ వంటగదిలోకి బోనులోపడ్డ సింహంలా తిరుగుతున్నాడు నాన్న. ప్రాణం కడగడ్తున్నదిలా వుంది శోషతో. మధ్య మధ్య మంచినీళ్ళతో గొంతు తడుపుకుంటున్నాడు.

అప్పటికి వంటై గంటైంది.

"లచ్చీ కోడలా – ఇచ్చా వరములందుకొందు బాల మాటల జవరాలా" రాగయుక్తంగా పాడుకుంటూ వంటగది మొత్తం వూడ్చి శుభ్రం చేసింది అమ్మ. వండిన వంటలన్నీ నట్టింట పెట్టింది.

పప్పబియ్యపప్పపు మావిక తప్పేలా, గోంగూర పులుసు రాచిప్ప, ముద్దపప్ప కంచుగిన్నె, ఇంగువ తాలింపువేసిన కొత్త చింతకాయ తొక్కు జాడీ, నిప్పల మీద కాల్చి నెయ్యి రాసిన అప్పడాల దొంతర, పొయిలో వెలిబూడిద శెగకి కరుగుతున్న నెయ్యి ఘ్రాణశక్తికి పని చెబుతున్నై. పెరటిలోంచి పెద్ద పెద్ద అరిటాకులుకోసి తెచ్చింది వీరభద్రుడి డాలుల్లా వున్నై అవి. వాటిని తడిగుడ్డతో తుడిచి శుభ్రం చేసింది.

తనదేం ఆలస్యం లేనట్టుగా పీటలు పరిచింది. కంచు మరచెంబులతో చల్లని జలం సిద్ధం చేసింది. కడకు దంచిన తవ్వని చిక్కుడాకుల్లోవేసి విస్తళ్ళ పక్కగా వుంచింది.

తిరిగి తిరిగి అలుపు వచ్చిందిలా వుంది నాన్నకి. నడవాలో కూలబడి పర్యంక బంధం వేసుకున్నాడు.

ఆ పూట మా తాలూకా హైస్కూల్‌కి శెలవ్. మధ్యాహ్నం మంచీ వెళ్ళాలి. పినపాక మంచీ తాలూకా హైస్కూలు రెండు మైళ్ళు వుంటుంది. నాకోపక్క ఆత్రంగా వుంది. ఆకలిగా కూడా వుంది.

రావల్సిన అతిథి రాలేదు.

ఆయన వచ్చి భోజనంచేస్తేగాని మాకు వడ్డనలు జరగవు. అదో సాంప్రదాయం. అతిథిని దేవుడుగా భావించడం ఆచారం. వచ్చేంత వరకూ నిరీక్షించవలసిందే. శోషవస్తే వుదకంతో వుపశమించాల్సిందే గాని కట్టుబాటుని అతిక్రమించని మనస్తత్వం.

బామ్మ మరీ అల్లాడ్తున్నది. ఆవిడ ప్రాణం కడగడ్తున్నది. "ఇలాగైతే తులసి తీర్థం పోయాల్సిందేరా నాయనా" అంటూ రాగాలు తీస్తున్నది. ఆవిడ ఎనభై ఏళ్ళ వృద్ధురాలు. ఆవిడ రాగం హెచ్చించి నప్పడల్లా కలకండముక్క అందిస్తున్నది అమ్మ. దంతాలు లేని నోటిలో కలకండ జ్వరం మీటరులో పాదరసంలా కరుగుతున్నది.

అలవాటుపడ్డ కాకులు ఎంగిలి మెతుకులకోసం బాదం చెట్టు మీద హడావిడి చేస్తున్నై.

మా అదృష్టం ఫలించింది. అతిథి దేవుడొచ్చాడు. ఆలస్యానికి క్షమార్పణలు లాంటివి ఏవీ ఆయన నోటి వెంట రాలేదు. ఎటూ వంటలవ్వాలి గదాని అవసరం పనిమీద బజారుకెళితే కాలాతీతమైంది. సంజాయిషీగా చెప్పి కొంచెం నొచ్చుకున్నాడు. ఆపైన ఆలస్యం చేయలేదు. పెరట్లో చేద బావి దగ్గరకి ఒక్కంగలో చేరి, చేదుకుని బడబడా నాల్గు చేదలొంపుకున్నాడు శరీరం మీద.

ఈలోగా వడ్డన చేసిందమ్మ.

నాన్న ఔపోసన చేశాడాయనకి.

అతిథి తింటంలో మునిగిపోయాడు. అమ్మకొసరి కొసరి వడ్డిస్తున్నది. ధారాళంగా నెయ్యి వంపుతున్నది. ఆయన చూపులు విస్తరి మీద – అక్కడ్నుంచి అమ్మ కాళ్ళ మీద పారాడుతున్నై.

అమ్మ ఎప్పడూ పు లు కడిగిన ముత్యంలా వుంటుంది. ఆ పూట గులాం రంగు నేత చీరె కాసాబోసి కట్టింది. చుక్కల పూల చీటిరవిక తొడుక్కుంది. అమ్మ కాళ్ళకి మొద్దుల్లాంటి

11-8-95 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

వెండి కడియాలుంటై. వేళ్ళకి ఇనప మత్తుల్లాంటి మట్టెలుంటై. తలశుభ్రంగా దువ్వుకుని ముడి వేసుకుంటుంది. ప్రతినిత్యం తులసమ్మకి పూజ చేస్తుంది. పూజచేసిన ఒంటిరెక్క మందారాన్ని ముడిలో తురుముకుంటుంది.

అమ్మని చూస్తే అద్భుతమైన భావం కలుగుతుంది. అపూర్వమైన గౌరవం కలుగుతుంది. నాన్న చూపుల్లోని భావాన్ని పసిగట్టి తదనుగుణంగా స్పందించటం అమ్మ ప్రత్యేకనైజం.

నేను పరీక్షగా చూస్తున్నాను. ఆయన చూపుల వంక. ఆయన పెదవుల కదలికల్ని గ్రహిస్తున్నాను. ఆయన సంతుష్టాంత రంగుడైనాడు. ఏ దురుద్దేశమూ, మరే వికారం కలగలేదాయనలో.

అతిథి భోజనమైంది.

నాన్న – చేయి కడుక్కోవటానికి నీరందించేడు పెరటిదాకా వెళ్ళి. ఆపైన – ఆకులు – వక్కలు – సున్నపు భరణితో, వీధి గదిలోకి తోడ్కొని వెళ్ళి ఆయన్ని చాప పరిచేడు విశ్రాంతికి. తలగడ పక్కగా తాటాకు విసినకర్ర వుంచాను నేను.

అతిథి చాప మీద బాసింపట్టు వేసుకుని తాంబూల సేవనంలో మునిగిపోయాడు.

మా భోజనాలైపోయేటప్పటికి రెండున్నరైంది. అపూట కూడా స్కూలు కూసింది. ఇక బలాదూరు తిరగటం మినహా చేసేదేమీ లేదు.

మా ఇంటి నానుకుని బాలమ్మగారి పెరడు. దాన్ని పెరడు అనేకంటే తోట అనడం సబబుగా వుంటుంది. ఏమైనా పెరడు అనడం అలవాటైంది. పెరటికి ప్రహరీగోడ కాదుగదా, కనీసం కంచె కూడాలేదు. పెరటినిండా మామిడి – సపోటా – నారింజలు విరగకాస్తుండేవి. ఎక్కువగా పిప్పళ్ళ చెట్లుండేవి. చెట్లనిండా పండిన పిప్పళ్ళు కొమ్మలకి దీపాలు పెట్టినట్టుగా వుండేవి. రాలిన పిప్పళ్ళు పగడాల్లా మెరుస్తుండేవి. పిప్పళ్ళు ఏరుకోనటమన్నా – కోసుకోవటమన్నా నాకెంతో ఇష్టం.

నేను జారుకోవాలంటే నాన్న పడుకోవాలి! లేకుంటే కట్టెమాను వడ్డిమీద విరుగుతుంది ఎండన బడి వెళ్ళినందుకు.

అతిథికి దిగచెమటలు కారుతున్నై. నాన్న పడుకొమ్మని అభ్యర్థిస్తున్నాడు. "లేదయ్యా రంగారావ్, ఈ రేకుల షెడ్డు వేడికి తట్టుకోనేక పోతున్నాను. ఆ పక్క పెరడులో చెట్లనీడన పడుకుంటా" నంటూ లేచాడు. చాప చుట్టి చంకన పెట్టుకున్నాడు. ఒకచేత విసినకర్ర. మరో చేత మంచినీళ్ళ చెంబుతో బాలమ్మగారి పెరడుకి నడిచేడు. నాకవకాశం కల్పించేడు నాన్న. వెళ్ళి ఆయన కాళ్ళు నత్తమని.

నేను శ్రీరామచంద్రుడ్ని కాకపోవచ్చు. మంచికొడుకునని నమ్మకంగా చెప్తాను.

పడుకుని, అటూ – ఇటూ దొర్లుతూ తన్నుకుంటున్నాడాయన భుక్తాయాసంతో "అన్నపూర్ణమ్మతల్లి ఎంతపని చేశావమ్మా! వద్దన్నకొద్దీ నెయ్యి వొంపేవు. ఎంత దొడ్డ చెయ్యమ్మా నీది. మహాతల్లివమ్మా నువ్వు. సాక్షాత్ కాశీ అన్నపూర్ణమ్మవే. నీ పవిత్రమైన పాదాల్ని చూశానమ్మా నా సంచితాలన్నీ పోయి జన్మ చరితార్థమైంది" నిద్రలోకి జారేడాయన.

ఆ సాయంత్రం –

అతిథి పెదవుల కదలికని బట్టి వూహించి వివరిస్తే గడుసు వెధవ్వే... నీకు భగవంతుడు అన్యాయం చేశాడని నాపోతూ గుండెల్లో పొదువుకుంది బామ్మ. టెంకిజెల్ల ఇచ్చింది అమ్మ మురిపెంగా.

ఇది నా పదేళ్ళ వయసులో జరిగిన సంఘటన.

అయితే –

ఆనాటి పరిస్థితులు వేరు. అలా సాగటానికి దోహదపడిన స్థితిగతులు వేరు. ఆ మర్యాదలు



వేరు. ఆ మన్ననలు వేరు; ఆ ఆదరణలు వేరు. అప్పటిలా ఇప్పుడు సాగాలంటే కుదరదు. వాస్తవమే!

ఎందుకంటే –

ఇరుకు ఇళ్ళ కాపురాలు – చాలీ చాలని జీతాలు; జీవితాలు అసంపూర్తి చిత్రాలుగానే వున్నై. అందరిదీ. అంత మాత్రాన నీచంగా దిగజారాలా?

ఏ చదువు నేర్పని సంస్కారం అలా వడిపాయి ఆనాడు.

చదువులు నేర్పిన సంస్కారం ఎలా నడుపుతున్నాయో చూడండి!

* * * * *

"పదకొండు దాటుతున్నది ఇంకా రాలేదేమిటి" విసుగ్గా అడుగుతున్నది భర్త సుందరాన్ని నా కోడలు అపర్ణ.

"వస్తాడు! కాసింత వోపిక పట్టు" చెబుతున్నాడు వాడు. వాడు ప్యాను తుడవటంలోనిమగ్నమై వున్నాడు.

చెవిలో మెషీ మంచుకుని, టి.వి. ముందు కూర్చున్నాను నేను. ఆదివారం కదా! ఏదో కార్టూన్ ఫిల్ము ప్రసారమౌతున్నది. నేను నిమిత్త మాత్రుణ్ణి. నాలుగేండ్లయింది. పైగా ఏకభుక్తుడ్ని... అరగంట ఆలస్యమైనా నష్టంలేదు. గంట ముందు తిన్నా ఒరిగేదీలేదు, అరిగేదీ లేదు. జీర్ణ ప్రక్రియ నా విషయంలో నిర్లక్ష్యం పాటించడం మొదలై చాలా కాలమైంది. మొత్తానికి దానికీ రిటైరుమెంటు దగ్గిరకొచ్చింది.

అప్పటికే టేబులు మీద అన్నీ సర్దింది అపర్ణ. ఉర్లగడ్డవేపుడు, పులిహూరు. పలావు, రాచమల్లు గింజల కుర్మా, ఉల్లిగడ్డల పెరుగుపచ్చడి, సగ్గు బియ్యం వడియాలు వేడిగా ఆవిర్లు కక్కుతున్నై. పింగాణీ ప్లేట్లు తుడిచి శుభ్రం చేసింది. రవ్వకేసరి మీద జీడిపప్పులు అద్దింది.

సుందరం తన స్నేహితుని కొడుకుని విందుకు ఆహ్వానించేడు. ఆ కుర్రాడు ఈ వూళ్ళోనే ఉద్యోగం చేస్తున్నాడట. హోటల్ కూడు తింటున్నాడట. అదీ విషయం! అతని చవిచచ్చిన జిహ్వాకోసం ఈ ఏర్పాట్లు.

పన్నెండు గంటలైంది.

అతను రాలేదు.

సుందరంకి చిరాకొచ్చింది. అపర్ణకి వెయిటింగ్ విసుగొచ్చింది. దాంతో నిర్ణయాలు మారినై. అసలు వస్తాడో, రాడో సందేహమవన్కులై "వస్తే తింటాడులే" అని, ఉభయులు తీర్మానించుకున్నవారై, టేబులు మీద వడ్డన కార్యక్రమం ప్రారంభించబోతుండగా సుందరంకి మరో సందేహం మొలుచుకొచ్చింది. తీరా తాము తింటుండగా అతను వస్తే టేబులు మీద చోటుండదు కాబట్టి కింద కూర్చుని తిందాం అని.

ఆ మాటా వాస్తవమే. మూడు సీట్ల డైనింగ్ టేబులది. వెంటనే బల్లమీద గిన్నెలన్నీ నేలకి చేరినై.

భోజనాలు చేస్తున్నాం!

పెరుగన్నంలో వుండగా వచ్చాడతను. అపర్ణ వెంటనే చేతులు కడుక్కుని లేచింది. ఎంగిళ్ళు గబగబా సర్దింది. అతనికి వడ్డించింది. నేను పడక్కుర్చీలోకి, సుందరం మంచం మీదకి చేరిపోయాం. అంతా ఆ గదిలో మునక్కోవాల్సింది. అతను భోజనం చేస్తున్నాడు.

పాతిక ముప్పైకి మధ్య వుంటుందతని వయస్సు. తెల్లగా మల్లి మొగ్గలా వున్నాడు. వంగి వడ్డిస్తున్నది అపర్ణ మర్యాదకోసం. అప్పుడు గ్రహించాను. అతని చూపులు ప్లేటు మీద లేవు. అపర్ణ చనద్వయం మీద తారట్లాడి కిందికి దిగి నడుము దగ్గర ముడతల మధ్య నిబిడీకృతమౌతున్నై. అతని చూపును గ్రహించాను. నా కనహ్యం వేసింది.

అపర్ణ ఇవేం గ్రహించటం లేదు. అలవాటు లేదు కదా పాపం! వంగివడ్డించడం, నడుము పట్టే సిందిలా వుంది బొడ్డు దగ్గరకి చీరపైకి మడిచి దోపుకున్న మడతల్ని వదిలేసి నిటారుగా నిలబడి నడుము మీద చేతులు వేసుకుంది. అతని చూపులు వాటిలో నిలిచిపోయాయి.

అతనెలాగో భోజనం కానిచ్చేడు.

కాసేపు సుందరం అతనూ పేకాడుకున్నారు. అతనే ఆట గెలవలేదు. ఆనక టీ త్రాగి వెళ్ళిపోయాడు.

ఐదు గంటలకి నేను ఈవినింగ్ వాకింగ్‌కి వెళ్ళాను. అది డాక్టరు సలహా! పాటించక తప్పదు. అలా అలా నడుచుకుంటూ వెళ్ళి పార్కులో కూలబడతాను. అక్కడ కాసేపు పచ్చగడ్డిమీద పడుకుని టి.వి. చూస్తాను. అదే నా సాయంత్రపు చర్య.

మామూలు ప్లేసులోకి వెళ్ళి కూర్చున్నాను. కను చీకట్లు ముసిరినై. పార్కంతా సందడిగా వుంది పిల్లలతో. అప్పటికే ఇద్దరు యువకులు పడుకుని వున్నారక్కడ. ఒకరి అభిముఖంగా వొకరు వొత్తిగిల్లి తలకింద చేతులుంచుకుని. ఆ ఇద్దరి తలలు కనిపిస్తున్నై నాకు. వారి మాటలూ వినిపిస్తున్నై.

"పన్నెండున్నరకి రూమ్‌కి వచ్చాను లేవు" అడుగుతున్నాడొకడు.

"అదా! మా డాడీ ఫ్రెండింటికి లంచికెళ్ళాను. వెళ్ళాను గాని ముద్దెక్కలేదు. పలావ్ ఫస్ట్ క్లాస్‌గా వుంది. అయినా తినలేక పోయాను. మొహమాటంతో కాదు. ఎందుకంటే మా డాడి ఫ్రెండు వైఫ్... చూస్తే ప్రపంచపు అంచుల దాకా ప్రయాణం చేయాలనిపించింది. ఇద్దరి పిల్లలతల్లైనా కత్తిలా వుంది. నా ఈడు పిల్లలున్నారంటే నమ్మరనుకో..." చెబుతున్నాడు.

ఆ కంఠాన్ని గుర్తు పట్టాను. ఆ మనిషిని గుర్తు పట్టాను. కసిగా చెవిలోంచి మిషను తీసేశాను. అతని సంస్కారానికి నిస్తుబోయాను. అతని తీరుకి కాండ్రించి ఉమ్మేయాలన్నంత అసహ్యం కలిగింది.

మంచి వింటానికి ఆనాడు చెవిలో మిషను లేదు.

చెడు వింటానికి ఈనాడు చెవిలో మిషనుంది.

ఆనాడు అన్నం పెట్టిన తల్లిని అన్నపూర్ణమ్మన్నారు.

ఈనాడు – ఆదరించి అన్నంపెట్టిన స్త్రీ రొమ్ముల్ని చూస్తున్నారు.

ఆనాడు 'నిజం' అనుకుంటే – ఈనాటిదినైజం అనుకోవాలా? లేక ఆనాటిది మానవనైజం అనుకుంటే – ఈనాటిది 'హిజం' అనుకోవాలా?

రక్తం తోడేస్తున్నట్టయింది. లేచి వచ్చేశాను. అది మంచీ నా ఊహ పాల్లు పోవడం లేదు. నాకా కళ అబ్బినందుకు గర్వించాలో – గర్హించాలో అర్థంకావడం లేదు. ఏది ఏమైనా ఈ విషయం ఎవరికీ చెప్పేనయను కాదిప్పుడు. చెబితే అపహాస్యం పాలౌతాను. చాదస్తం, అనుమానం అంటారు. ●




## మర్యాద

మర్యాదకూ, సంస్కారానికీ పేరు పొందిన ఆస్ట్రేలియన్ జడ్జి సర్ రెడ్‌మండ్ బేరీ ఒకసారి తన స్నేహితుడితో కలసి మెల్‌బోర్న్ వీధి వెంట వెళ్తూ వున్నాడు. ఎదురుగా చింకి పీలికలతో వున్న ఓ ముష్టివాడు తన కుళ్ళిపోయిన టోపీ నెత్తి జడ్జికి అభివాదం చేశాడు. వెంటనే జడ్జి అతి మర్యాదగా, తన టోపీని ఎత్తి, ఆ బిచ్చగాడికి ప్రత్యభివాదం చేశాడు.

ఆశ్చర్యపడిన స్నేహితుడు...

"ఆ ముష్టివాడికంత మర్యాద ఇవ్వాలా?" అనడిగాడు.

జడ్జి నవ్వుతూ స్నేహితుడి భుజం తట్టి...

"అంటే, మర్యాదలో ఆ ముష్టివాడికంటే నేను వెనుకబడి పోవాలని కోరుకుంటున్నావా?" అన్నాడు.